# బెజ్జంకిలో బడిబాట కార్యక్రమం



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలు, వాటి విశిష్టతలు గ్రామస్తులకు మరియు తల్లిదండ్రులకు తెలియజేయడం కోసం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జంకి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను నమోదు పెంచాలని,అందుకు తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. అలాగే నాణ్యమైన విద్యతో పాటు నూతన విద్యా సంవత్సరం నుండి ఏఐ కంప్యూటర్ ద్వారా పాఠ్యాంశాల్ని బోధించడం జరుగుతుందని, విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించడంతోపాటు, మధ్యాహ్న భోజనం, వారానికి మూడు గుడ్లు, రాగి జావా, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుస్తులు మొదలగు సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓ. నగేష్, ఎన్. రాములు. టి. శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు బి.చందు, భూమయ్య, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేట్ లో భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని బేగంపేట గ్రామంలో గ్రామస్తులు భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కు మద్దతు తెలుపుతూ శుక్రవారం గ్రామ ప్రధాన దారి వెంట ర్యాలీ నిర్వహించారు. భారతమాత కి జై అంటూ, తీవ్రవాదం నశించాలంటూ గ్రామస్తులు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు బుర్ర మల్లేశం గౌడ్ మాట్లాడుతూ పహల్గాం లో జరిగిన ఉగ్ర దాడి హృదయ విదారకమైందని , భార్య ముందే భర్త ను చంపి ఉగ్రవాదులు రాక్షసనందం పొందారని, ఆ ఆడబిడ్డ నుదుటి సింధూరాన్ని తుడిచిన, ఉగ్ర మూకలను, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ దేశాన్ని, భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ ద్వారా తగిన గుణపాఠం చెబుతుందని, భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి దేశ ప్రజలు నిరంతరం అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ చింతలపల్లి సంజీవరెడ్డి, బిజెపి నాయకులు బుర్ర క్రాంతి కుమార్ గౌడ్, గ్రామస్తులు జంగిటి రాజు రెడ్డి,ఎరవెల్లి కొమురయ్య, వెల్డింగ్ రాజు, ఎల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# భారత సైనికులకు మద్దతుగా కోరుట్ల ముస్లింలు




కోరుట్ల, జనతా న్యూస్ : కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌తో పాటు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ సైనికులు ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఉగ్రవాద శిబిరాలను సర్వనాశనం చేసిందని. ఈ సక్సెస్ భారత్ సైనికులకు అంకితమని కోరుట్ల మైనార్టీ రిపోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అన్వార్ సిద్ధిక్, అన్నారు. భారత సైనికులు చేసిన ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా శుక్రవారం కోరుట్ల పట్టణం లోని కార్గిల్ చౌక్ వద్ద భారత్ -పాక్ మధ్య జరుగుతున్న ఆపరేషన్ సిందూర్ లో భారత సైన్యం చూపిస్తున్న శౌర్యానికి సంఘీభావం తెలుపుతూ నిర్వహించారు. జాతీయ జెండాలు పట్టుకొని దేశభక్తి నినాదాలు చేస్తూ. ఈ సందర్భంగా కోరుట్ల ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎండి రఫీ, ఎం ఏ నయీమ్, మిరజా ముక్రమ్ బైగా,సయ్యద్ ఫహీమ్, అస్లాం, మాట్లాడుతూ పాకిస్థాన్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించే క్రమంలో దేశ రక్షణకు ఇది కీలకమైన అడుగని పేర్కొన్నారు. ఆర్మీ వీరులు ధైర్య సాహసాలకు ప్రత్యేకంగా ఆపరేషన్ సింధూర్ నిలుస్తుందని మునుముందు భారత సైన్యం తీసుకునే చర్యలు ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లను పరిగెత్తిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ముస్లిం మత పెద్దలు నాయకులు యువకులు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ సిఐగా సదన్ కుమార్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా జి సదన్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిసిఎస్ లో సిఐగా పనిచేసిన సదన్ కుమార్ తిమ్మాపూర్ సర్కిల్ కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎల్ఎండి ఎస్సై వివేక్, ప్రొఫెషనరీ ఎస్సై క్రాంతి కుమార్ బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్, పాక్ విషయంలో సోషల్ మీడియాలో ఎవరు రెచ్చగొట్టే, అభ్యంతరకరమైన పోస్టులు పెట్టొద్దని సూచించారు. ప్రస్తుత తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలోని తిమ్మాపూర్, చిగురుమామిడి, గన్నేరువరం ఎస్ఐలకు సూచనలు, సలహాలు అందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

# కరీంనగర్ జిల్లా జర్నలిస్టు కుటుంబాలకు.. ఆర్థిక సహాయం అందించిన మంత్రి పొంగులేటి

## ముగ్గురు జర్నలిస్టులు హుజురాబాద్ కు చెందిన వారే..



హుజురాబాద్, మే 9 జనతా న్యూస్: ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన హుజురాబాద్ జర్నలిస్టు కుటుంబాలకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాదులో రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు జర్నలిస్టు వెల్ఫేర్ ఫండ్ ద్వారా రూ.1లక్ష ఆర్థిక సహాయం, 5 సంవత్సరాలు నెలకు రూ.3వేలు పెన్షన్, 10వ తరగతి లోపు చదివే పిల్లలకు ఉంటే ఒక్కొక్క వెయ్యి చొప్పున, శాశ్వత అంగవైకల్యం పొందిన జర్నలిస్టులకు రూ.1లక్ష చొప్పున అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంటుందని త్వరలో అక్రిడిటేషన్ కార్డుల తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకి జిల్లా కలెక్టర్ లకు అదేశాలు జారీ చేస్తామన్నారు.

**జర్నలిస్ట్ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత**

కరీంనగర్ జిల్లాలో మృతి చెందిన నలుగురికి జర్నలిస్టుల కుటుంబాలకు, అనారోగ్యానికి గురైన నలుగురు జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల మరణించిన హుజురాబాద్ కు చెందిన పత్తి విష్ణువర్ధన్ రెడ్డి, బాణాల శ్యాంసుందర్, ముజాహిద్ ఖాన్ లతో పాటు అన్నేపాక సురేందర్ కుటుంబాలకు రూ.లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. శాశ్వత అంగవైకల్యం పొందిన జి ఉదయకుమార్, పత్తి కొండారెడ్డి, ఉమ్మడి రాజేష్, జడల చిరంజీవి లకు రూ. లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణలతో పాటు ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, కరీంనగర్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్, హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్ పాల్గొన్నారు. ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదుకున్న ప్రభుత్వానికి, ఇందుకు కృషి చేసిన మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డికి జర్నలిస్టు సంఘం ప్రతినిధులు, హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షా కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# దేశ శాంతికి సహకరించండి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : దేశంలో శాంతి కోసం అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి సదన్ కుమార్ పిలుపునిచ్చారు తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ భారత్ పాక్ యుద్ధ సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వివరించాలని సూచించారు గ్రామంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసిన, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్ట్ పెట్టిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఒక్కొక్కరికి ఒక్కో వ్యక్తిగత ఆలోచనలు ఉంటాయని, అవి ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని తెలిపారు. ఎలాంటి విషయాలైనా రాద్ధాంతం చేయకుండా పోలీసులకు తెలుపాలని సూచించారు. ప్రజల సేఫ్టీ ముఖ్యమని

దేశం ఐక్యతగా ఉండాలాంటె మనమంతా ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు వివేక్, క్రాంతి కుమార్, నాయకులు ఎస్ ఎల్ గౌడ్, నర్సింగ రావు, కొత్త తిరుపతిరెడ్డి కొండలరావు, ఎలుక రాజు, బోయిన తిరుపతి ఫయాజ్, మిరాజ్, మహమ్మద్ అలీ, సాబీర్ హుస్సేన్, మూస, తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

**హుజురాబాద్ సి ఐ కరుణాకర్**




హుజురాబాద్, మే 9 జనతా న్యూస్: హుజురాబాద్ టౌన్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని టౌన్ సి ఐ కరుణాకర్ అన్నారు. సి ఐ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అయన మొదటిసారి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎవరికి శాంతిభద్రతల సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని, దళారులను నమ్మవద్దని విజ్ఞప్తి చేసారు. దొంగతనాల నియంత్రణకు కృషి చేస్తామని, పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేస్తామని, అవసరమున్న చోట సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని అయన తెలిపారు. భూ తగాదాల విషయంలో పోలీసులు జోక్యం చేసుకోరని, కోర్టులో తేల్చుకోవాలని అయన అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అక్రమ మద్యం వ్యాపారం, అక్రమ సిట్టింగులు వంటి వాటిని కఠినంగా వ్యవహరిస్తామని, జూదం, మట్కా లపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై కూడా ప్రత్యేక దృష్టి పెడతామని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని అయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కూడా కఠినంగా అమలు చేస్తామని, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు, భారీ వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అక్రమ ఇసుక వ్యాపారాన్ని, అక్రమ దందాల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామని, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అయన హితవు పలికారు. శాంతిభద్రతలకు అన్ని వర్గాలు సహకరించాలని అయన విజ్ఞప్తి చేసారు. పోలీసు శాఖ అధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఫ్రెండ్లీ పోలీస్ కు ప్రాధాన్యం ఇస్తామని సి ఐ కరుణాకర్ స్పష్టం చేసారు.

# కొత్త సి ఐ కి కాంగ్రెస్ నేతల సన్మానం



హుజూరాబాద్, మే 9 జనతా న్యూస్: హుజూరాబాద్ సి ఐ గా బాధ్యతలు స్వీకరించిన సీఐ కరుణాకర్ ను హుజూరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు సి ఐ కి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలుగూరి కిరణ్ కుమార్, సోషల్ మీడియా ఇంచార్జి మిడిదొడ్డి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి సదానందం, ఉమాపతి రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయుల 57 డిమాండ్లు సత్వరమే పరిష్కరించాలి

**పి ఆర్ టీ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల్కార్ వెంకటేష్**

హుజురాబాద్, మే 9 జనతా న్యూస్: రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న 57 డిమాండ్లు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల్కార్ వెంకటేష్ డిమాండ్ చేసారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఇటీవల ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సెక్రటేరియట్లో నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశానికి ఉద్యోగుల జేఏసీలో భాగంగా రావుల్కార్ వెంకటేష్ హాజరయ్యారు. గురువారం హుజురాబాద్ కు వచ్చిన అయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై సిఎం ఆదేశాల మేరకు గతంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు దిద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కమిటీ వేశారని, ఇది కాలయాపనకే పరిమితమైందని, సమస్యలు ఇప్పటికి పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన ఐఏఎస్ అధికారుల కమిటీ కూడా పై కూడా ఉద్యోగులు నమ్మకం కోల్పోతున్నారని అన్నారు.

రిటైర్మెంట్ అయిన, అవుతున్న ఉద్యోగులు తమకు బెనిఫిట్స్ రావేమోననే ఆందోళనతో తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని, ఇటీవల కొందరు మృతి చెందిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల , ఉపాధ్యాయుల,పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఉద్యోగులకు, వారి కుటుంబాలకు జరిగే నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అయన హెచ్చరించారు. ఉద్యోగులు తమ న్యాయపరమైన డిమాండ్లే అడుగుతున్నారని, ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల 57 డిమాండ్లతో కూడిన అన్ని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వెంకటేష్ డిమాండ్ చేశారు.

# జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్య పరిష్కారం కోసం..

**మంత్రి పొంగులేటిని కలిసిన హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు**

హుజురాబాద్, మే 9 జనతా న్యూస్: హుజురాబాద్ పట్టణంలో జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్ శుక్రవారం హైదరాబాదులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డిని కలిశారు. హైదరాబాదులో ప్రెస్ అకాడమీలో జరిగిన బాధిత జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి హాజరైన మంత్రిని వారు కలిశారు. గత ప్రభుత్వ హయాంలో హుజురాబాద్ ఎస్సారెస్పీ క్యాంపులో జర్నలిస్టులకు నివాస స్థలాలకు పట్టాలు అందజేశారని, కొందరు జర్నలిస్టులు ఇళ్లను కూడా నిర్మించుకున్నారని ఈ స్థలాలకు నీటిపారుదల శాఖ నుండి క్లియరెన్స్ అందజేయాలని అధ్యక్ష కార్యదర్శులు మంత్రి దృష్టికి, ప్రెస్ అకాడమీ చైర్మన్ తీసుకువెళ్లారు. తాను త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డితో హుజురాబాద్ జర్నలిస్టుల సమస్య చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తానని, జర్నలిస్టులు కోరుకున్న విధంగా నీటిపారుదల శాఖ నుండి క్లియరెన్స్ కూడా అందిస్తామని మంత్రి, ప్రెస్ అకాడమి చైర్మన్ ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు అధ్యక్ష కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్ తెలిపారు.



